ఘనంగా యోగా దినోత్సవం

● యోగాసనాలు వేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులు



వాంకిడి: యోగా చేస్తున్న ప్రజలు



ఆసిఫాబాద్‌రూరల్: యోగా చేస్తున్న విద్యార్థులు



కౌటాల: కేజీబీవీలో..



గెర్రెలో యోగా చేస్తున్న ఏపీవో కల్పన



పెంచికల్‌పేట్: యోగా చేస్తున్న విద్యార్థులు

దహెగాం: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఈజీఎస్ ఏపీవో కల్పన అన్నారు. శుక్రవారం ప్రపంచ యోగా దినోత్సవాన్ని మండలంలోని పలు పంచాయతీల్లో నిర్వహించారు. గెర్రె గ్రామంలోని ప్రజలతో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జ్యోతి, టీఏ మారూతి, ఎఫ్ఏ రాకేశ్, ప్రజలు పాల్గొన్నారు.

కౌటాల: యోగాతో ఆరోగ్యంగా ఉంటారని, ప్రతిఒక్కరూ యోగా చేయాలని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల ఎస్‌వో పవిత్ర అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగాసనాలు వేశారు. మానసిక, శారీరక రోగాలను నయం చేసే శక్తి యోగాకు ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: యోగాతో విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ అన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా యోగాతో కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. గత రెండు సంవత్సరాలుగా వసుధ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ప్రతీ రోజు యోగా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యోగా శిక్షకుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, పీడీ తిరుపతి పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, కేజీబీవీలో అధికారులు, విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అల్బర్ట్, ఎంపీవో గంగాసింగ్, కాంప్లెక్స్ హెచ్ఎం విజయ నిర్మల, ఎస్‌వో కవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జైనూర్: యోగా చేయడంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని వైద్యాధికారి రాజు అన్నారు. మండలంలోని ఉశేగాం ప్రభుత్వాసుపత్రిలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సాంబలక్ష్మి, మలేరియా సబ్ యూనిట్ అధికారి గణేశ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కెరమెరి: మండలంలోని గోయగాం, కెరమెరి, ఝరి ఉన్నత పాఠశాలలతో పాటు మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో యోగా దినోత్సవం నిర్వహించారు. యోగా వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ఎనిమిది రకాల యోగాసనాలు వేయించారు.

వాంకిడి: మండలంలోని సరాండి రహదారిపై కాలువ పక్కనున్న యోగా కేంద్రం వద్ద పతాంజలి యోగ ప్రచారక్ దొడ్డాజీ, యోగా సాధకులు తిరుపతి, పుండలిక్, రవిలు యోగాసనాలు వేయించారు. అనంతరం యోగా ప్రాముఖ్యతను వివరించారు. క్రమం తప్పకుండా యోగా చేయాలని సూచించారు. అంతకు ముందు కేక్ కట్ చేశారు.

కాగజ్‌నగర్ రూరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం భారత్ స్వాభిమాన్ ఆధ్వర్యంలో పట్టణంలోని పటేల్‌గార్డెన్‌లో నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, భారత్ స్వాభిమాన్ సంఘం జిల్లా ప్రభారి రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రపంచ యోగా దినోత్సవాన్ని నిర్వహించుకోవడం గర్వంగా ఉందన్నారు. బాలభారతి పాఠశాలలో పతాంజలి ఆధ్వర్యంలో, ఎస్పీఎం క్రీడామైదానంలో సుమిత్ ఫిట్‌నెస్ సెంట్ ఆధ్వర్యంలో, డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో, ఎస్పీఎం ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు.

కౌటాల: హైదరాబాద్‌లోని నిజాం కాలేజీ మైదానంలో నిర్వహించిన యోగా వేడుకల్లో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు పాల్గొన్నారు.



జైనూర్: యోగాసనాలు వేస్తున్న వైద్య సిబ్బంది



కెరమెరి: ధనోరాలో..



యోగా చేస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

● కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

వాంకిడి: అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని ఘాట్‌జనగాం పాఠశాలను జిల్లా విద్యాధికారి అశోక్‌తో కలిసి పరిశీలించారు. పనుల్లో జాప్యం జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా సమయపాలన పాటించాలని, నాణ్యమైన విద్యానందించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, ఎంపీడీవో వరలక్ష్మి, ఎంపీవో జావిద్, ఈజీఎస్ ఏపీవో శ్రావణ్ కుమార్, విద్యుత్ శాఖ ఏఈ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడుతాం



నోటీసులు చూపుతున్న బీజేపీ నాయకులు, రైతులు

రెబ్బెన: సోనాపూర్‌లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులకు అండగా ఉండి, వారికి న్యాయం జరిగే వరకు పోరాడుతామని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్ అన్నారు. గ్రామంలోని రైతులను శుక్రవారం కలిశారు. ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన రైతులు 40 ఏళ్లుగా ప్రభుత్వ, పోడు భూముల్లో వ్యవసాయం చేసుకుంటున్నారని తెలిపారు. సాగు చేస్తున్న భూములు అసైన్డ్ భూములని, వాటిని రెవెన్యూ అధికారులే ఫారెస్టు అధికారులకు అప్పగించినట్లు రికార్డులు ఉన్నాయని తెలిపారు. కేవలం ఎస్సీ, బీసీ రైతులకు అటవీశాఖ అధికారులు నోటీసులిచ్చి, ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూముల్లోకి వెళ్లొద్దని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రతీ రైతుకు ఐదెకరాల చొప్పున మంజూరు చేయడంతో పాటు శాశ్వత పరిష్కారం చూపాలని, అంతవరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రైతులు మధుకర్‌గౌడ్, శ్రీనివాస్, సరస్వతి, మహేశ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వటసావిత్రి పూజలు



జిల్లా కేంద్రంలో పూజలు చేస్తున్న మహిళలు



రావి చెట్టుకు పూజలు చేస్తున్న మహిళలు

ఆసిఫాబాద్‌అర్బన్: వటసావిత్రి వ్రత పూజలను శుక్రవారం జిల్లా కేంద్రంలో మహిళలు ఘనంగా నిర్వహించారు. బ్రాహ్మణవాడ, వాసవీనగర్, శివకేశవ మందిర్, జన్కాపూర్, తదితర కాలనీలో మహిళలు మర్రిచెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఒకరికొకరు వాహినలు ఇచ్చి పుచ్చుకొన్నారు.

కెరమెరి: మండల కేంద్రంలోని వివిధ కాలనీలకు చెందిన మహిళలు శివాలయానికి తరలివచ్చి భక్తిశ్రద్ధలతో రావి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. నవధాన్యాలు, నూతన వస్త్రాలను సమర్పించారు. అనంతరం స్థానిక అర్చకుడు కులకర్ణి బాపూదేవ్ రావి చెట్టు వద్ద ప్రత్యేకంగా కలశ పూజ నిర్వహించారు. మంగళహారతులిచ్చారు.

కౌటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో వటసావిత్రి పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీకోదండ రామాలయం, సదాశివపేట శివాలయాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని మర్రిచెట్టుకు పూజలు చేశారు.



రెబ్బెన: మంగళహారతులతో మహిళలు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో మహిళలు వటసావిత్రి వ్రతాలు నిర్వహించారు. మర్రిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేసి దూపదీపాలతో నైవేద్యాలు సమర్పించారు. మంగళహారతులు ఇచ్చి పూజలు చేశారు.

వాంకిడి: మండల కేంద్రంలోని మహిళలు మర్రిచెట్టు, తులసి మొక్కలకు ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ ముండె విమలబాయి తులసి మొక్కలను పంపిణీ చేశారు. భర్త, పిల్లలు ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కుకున్నారు.

నిలిచిన 'కాంప్లెక్స్' నిర్మాణం



అర్ధంతరంగా నిలిచిన కాంప్లెక్స్ భవన నిర్మాణాలు

● పూర్తయితే గ్రామ పంచాయతీకి భారీ ఆదాయం

● పట్టించుకోని అధికారులు

బెజ్జూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ స్థలంలో మూడు సంవత్సరాల క్రితం రూ.33 లక్షల పంచాయతీ నిధులతో నిర్మిస్తున్న కాంప్లెక్స్ భవన నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. పంచాయతీ తీర్మానం లేకుండా సర్పంచ్ ఇష్టానుసారంగా నిర్మాణం చేపడుతున్నారని, జీపీ నిధులే కాకుండా బయట నుంచి డబ్బులు వసూలు చేసి కాంప్లెక్స్ చేపడుతున్నారని మండల కేంద్రానికి చెందిన కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పనులు నిలిచిపోయాయి. గతంలో కాంప్లెక్స్ నిర్మాణ స్థలంలో చిన్నచిన్న కూరగాయల కొట్లు, చికెన్ వ్యాపారులు, మంగళ షాపులు పెట్టుకొని జీవన ఉపాధి పొందిన వారికి భవనం పూర్తి కాకపోవడంతో ఎనలేని కష్టాలను తెచ్చి పెట్టింది. దాదాపు మూడు సంవత్సరాలు కావస్తున్నా కాంప్లెక్స్ పూర్తి కాకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న చిన్న వ్యాపారస్తులు ప్రైవేట్ అద్దె కట్టలేక నానాఅవస్థలు పడాల్సిన వస్తుందని వాపోతున్నారు.

ప్రైవేట్ వ్యక్తుల వాహనాలకు ఉపయోగం..

కాంప్లెక్స్ నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో సమీపంలోని అందులో ప్రైవేట్ వ్యక్తులు వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు ప్రతిరోజు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ సొమ్ము ప్రజలందరిది కాబట్టి కాంప్లెక్స్ నిర్మాణంలో ఎలాంటివి వాహనాలు, ఇతర అవసరాలకు ఉపయోగించకూడదని సంబంధిత వ్యక్తులకు నోటీసులు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేక అధికారుల పాలనలో..

సర్పంచుల పదవి కాలం ముగియడంతో గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులను ప్రభుత్వం నియమించింది. ప్రత్యేకాధికారులు చొరవ తీసుకొని కాంప్లెక్స్ త్వరగా పూర్తిచేస్తే ప్రజలు, వ్యాపారస్తులకు మేలు జరుగుతుందని మండలవాసులు కోరుతున్నారు. అలాగే గ్రామపంచాయతీకి రూ.50వేల వరకు ఆదాయం సమకూరనుంది.

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కెరమెరి: ఐటీడీఏ పాఠశాలలో ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న టీచర్లను బదిలీ చేయాలని, దానికి సంబంధించిన షెడ్యూల్ విడుదల చేయాలని శుక్రవారం మండలంలోని గిరిజన పాఠశాల ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీపీటీఎఫ్ ఆదేశాల మేరకు సమస్య పరిష్కారం అయ్యే వరకు దశల వారీగా నిరసనలు చేపడుతామని హెచ్చరించారు. ఇతర శాఖలకు చెందిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపడుతున్నప్పటికీ గిరిజన సంక్షేమ శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో టీపీటీఫ్ నాయకులు చహకటి శ్యాంరావు, నైతం నారాయణ, సిడాం కర్ను, దాము పాల్గొన్నారు.

ధర్నా విజయవంతం చేయాలి



సొనాలలో మాట్లాడుతున్న నాయకులు

బోథ్: ఆదివాసీల హక్కుల కోసం తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఈనెల 24న ఉట్నూర్‌లో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఆదివాసీ నాయకులు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో, సొనాలలో ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఉపాధ్యాయుల భర్తీని చేపట్టాలన్నారు. ఐటీడీఏలో బ్యాక్ లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దుర్వ విశ్వేశ్వర్, పెద్ది సంతోష్, మెస్రం భూమన్న, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వర్షం.. రైతుల హర్షం



పెంచికల్‌పేట్, లోడుపల్లి రహదారిపై వరద

దహెగాం: గత కొన్నిరోజుల నుంచి వర్షాలు జాడ లేకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. అయితే శుక్రవారం కురిసిన వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. వేల రుపాయల పెట్టుబడులు పెట్టి విత్తనాలు విత్తుకున్నామని ఆందోళన చెందారు. మండల కేంద్రంతో పెద్ద ఐనం, చిన్న ఐనం, పార్వతిపేట గ్రామాల్లో వర్షం కురిసింది. దీంతో పత్తి విత్తనాలు మొలకెత్తుతాయని రైతులు పేర్కొంటున్నారు.

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో వర్షం కురిసింది. పెంచికల్‌పేట్– లోడుపల్లి ప్రధాన రహదారి పైన ఉన్న లోలెవల్ వంతెనపై నుంచి వరద నీరు పారింది. వర్షానికి గొంట్లపేట్– పోతెపల్లి ప్రధాన రహదారి చిత్తడిగా మారడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

తిర్యాణి: మండల కేంద్రంలోని కన్యకా పరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు కుమురం భీం చౌక్ నుంచి ఆలయం వరకు అమ్మవారికి సమర్పించే వెండి చీరతో ఊరేగింపు చేపట్టారు. రెండు రోజుల పాటు కొనసాగు వేడుకల్లో భాగంగా శనివారం మహా అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు పల్లెర్ల విగ్నేశ్, గందె రాజయ్య, రవి, అశోక్ పాల్గొన్నారు.

నేడు అద్దె గదులకు వేలం

పెంచికల్‌పేట్: ఎల్కపల్లి గ్రామ పంచాయితీ అద్దె గదులకు శనివారం ఉదయం 10 గంటలకు పంచాయితీ కార్యాలయంలో వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి కుకిడే చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు డిపాజిట్‌గా రూ. 5 వేలు చెల్లించి పాల్గొనవచ్చన్నారు.

పోడు భూముల సమస్య పరిష్కరించండి



మంత్రితో మాట్లాడుతున్న రైతులు

కౌటాల, సిర్పూర్(టి): సిర్పూర్(టి) మండలంలోని ఇటికలపాడు గ్రామస్తులు శుక్రవారం హైదరాబాద్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను కలిసి తమ గ్రామంలోని పోడు సమస్య పరిష్కరించాలని కోరారు. గ్రామానికి చెందిన రెండు వందల మంది రైతులు ప్రత్యేక వాహనాల్లో హైదరాబాద్‌కు వెళ్లి సిర్పూర్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్‌తో కలిసి మంత్రి సీతక్కను కలిశారు. పోడు సమస్య కారణంగా అటవీశాఖ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. స్పందించిన మంత్రి కలెక్టర్, జిల్లా అటవీశాఖ అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. గ్రామస్తులు జోలికి వెళ్లావద్దని సూచించారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కౌటాల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం మండలంలోని తుమ్మిడిహెట్టి గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. తమ గ్రామంలోని గ్రామదేవతలకు సంబంధించిన స్థలంలో పీపీనగర్ గ్రామానికి చెందిన ఆత్మారాం, చరణ్‌దాస్ అనే ఇద్దరు వ్యక్తులు దౌర్జన్యంగా కిరాణ దుకాణాలు ఏర్పాటు చేశారని, దుకాణాలు తొలగించాలని తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా.. పట్టించుకోలేదని ఆరోపించారు. రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో కార్యాలయం ఎదుట ఆందోళన చేయాల్సి వచ్చిందన్నారు. 60 ఏళ్లుగా ఈ స్థలంలో గ్రామ దేవతల విగ్రహాలున్నాయని, ఈ విషయంలో విచారణ చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇన్‌చార్జి తహసీల్దార్ రవీందర్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోరేతు పత్రు, సిడాం పోచయ్య, గజానన్, దాదాజీ, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

వాస్తవాలను నమోదు చేయాలి

కాగజ్‌నగర్ రూరల్: మిషన్ భగీరథ ఇంటింటా కుళాయి పథకంలో చేపట్టిన సర్వే పూర్తి చేసి, వాస్తవాలను నమోదు చేయాలని ఎంపీవో గౌరీశంకర్ సూచించారు. శుక్రవారం కాగజ్‌నగర్ మండలంలోని రాంనగర్ గ్రామ పంచాయతీ కేంద్రంలో సర్వే అమలు తీరును పరిశీలించారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లు లేకుండా వాస్తవాలను నమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి అశోక్, తదితరులున్నారు.

విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి

పెంచికల్‌పేట్: మండలంలోని కొండపల్లి పరిధిలోని గొల్లవాడలో విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బొల్లబోయిన భీమయ్యకు చెందిన ఎద్దు గ్రామ సమీపంలోకి మేతకు వెళ్లింది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి మృతి చెందింది. గమనించిన స్థానికులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. విద్యుత్‌శాఖ తరపున నష్ట పరిహారం చెల్లించాలని బాధిత రైతు కోరుతున్నాడు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

కాగజ్‌నగర్‌రూరల్: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం అన్నారు. శుక్రవారం కళాశాలలో మాదక ద్రవ్యాల వినియోగం– యువతపై ప్రభావం అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అధ్యాపకులు జనార్దన్ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి మంచి భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటేశ్వర్లు, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి



వివరాలు తెలుసుకుంటున్న అధికారి శ్రీధర్

ఆదిలాబాద్‌టౌన్: డి అడిక్షన్ సెంటర్‌లోని రోగులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి మెట్పల్లివార్ శ్రీధర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని టీచర్స్ కాలనీలో గల డావ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మద్యపానం మత్తు పదార్థాల పునరావస కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ రోగి పూర్తి వివరాలను నమోదు చేయాలని సూచించారు. రోగులకు నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. ఆయన వెంట ప్రదీప్, రిమ్స్ సైకియాట్రిస్ట్ ఓం ప్రకాశ్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పాముల సయ్యాట



చింతలమానెపల్లి మండలంలోని బాలాజీ అనుకోడ గ్రామంలో శుక్రవారం పాముల సయ్యాట ఆకట్టుకుంది. గ్రామ పంచాయతీ సమీపంలోని గడ్డి కుప్ప వద్ద పాములు సయ్యాట ఆడుతుంటే స్థానికులు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. మనుషుల అలజడిని గమనించిన పాములు అక్కడి నుంచి జారుకున్నాయి.

– చింతలమానెపల్లి